కథానిక

# ప్రేమ బంధం

శ్రీమతి మునిపల్లె సరస్వతి

గవర్నమెంటు స్కూల్లో యస్. యస్. ఎల్. సి. పాసయిన నేనూ, మా ప్రభాకరం గుంటూరు కాలేజీలో చేరాము. చిన్ననాటినుండి పల్లెటూరి వాతావరణములో మెలగిన మాకు బస్తీ అంటే అదో కుతూహలముగా నుండేది. తిరగడమనేది మా యిరువురకు సరదాగానే వుండేది. చదువులో ఒకరి నొకరము తీసిపోయేవాళ్లముగాదు. చిన్ననాటినుండి ఒక మంచాన పరుండి, ఒక కంచాన తిని చివరకు పెద్దయ్యాక యిరువురం వియ్యమందుదామనుకున్నాము గూడా చివరకు. మా వూరి పంతులు మాటద్వారా మా నాన్న నన్ను కాలేజీకి పెట్టాడు. ప్రభాకరం తండ్రి గతించిపోయాడు. వున్న మూడెకరాలు పండింపజేసుకుంటూ, వాళ్లమ్మ వంటిమీది నగలమ్మి నాతో వాణ్ణీ చదువుకు పంపింది. క్రొత్తలో కాలేజీకి వెళ్ళాలంటే చాల భయంగా నుండేది. కాని రానురాను కాలేజీకి ఎప్పుడు వెళ్దామా ... అని అనిపించే రోజులొచ్చాయి. ఇది అందరబ్బాయిలకు అనిపిస్తూనే వుంటుందనుకుంటా!

కాలేజీకి శలవురాగానే ప్రభాకరం, నేనూ బయల్దేరేవాళ్లం. ఎక్కడైనా ఆడపిల్ల మా కంటబడితే యమయాతనలుపెట్టి పంపేవాళ్ళం. వెక్కిరింపులు, వేళాకోళాలును. ప్రతి బజారు మాకు పరిచయమైనదనే చెప్పాలి. ఆడపిల్లల్ని గుర్తించడంలో మాదే పెద్దచెయ్యి. ఏ పిల్ల ఏ స్కూల్లో చదివేది రూఢిగా చెప్పగల మేటివారలమయ్యాం. పాపం, ప్రభాకరం నేను చెప్పినట్టు చేసేవాడు. వాడు ఫీజుకట్టలేక అవస్థపడుతూంటే కాస్త నేనే సర్దుబాటు చేస్తూండేవాణ్ణి. అందుచేత వాడు నాకు లోకువయ్యాడు. కాని ఒక్కమాటకూడా వాణ్ణి అని, వాడి మనసు బాధపెట్టేవాణ్ణిగాదు ... అందుకే మా యిద్దరికి స్నేహం బాగా కుదిరిపోయింది.

ఆ రోజు కాలేజీకి శలవు. ఆదివారం గాబట్టి సినీమాలకు బయల్దేరారంతా ... ఆ రోజు నేను, మా వాడు ప్రభాకర్ టాకీస్‌కు బయల్దేరాం. మా ముస్తాబంతా వ్యర్థమైంది. ఆవరణలో కాలెట్టగానే తాటికాయంత అక్షరాలతో "స్త్రీలకు ప్రత్యేకముగా టిక్కెట్లు యివ్వబడును" అని వ్రాసివుంది. ఆ బోర్డు చూడగానే మా నెత్తిన పిడుగుపడ్డట్టయినది. ఆడవీవనలు వేరయ్యాయనే మా బాధ. ఇదివరకు ఆడవారికి మగవాళ్లకు వొకచోటే టిక్కెట్లు యిచ్చేవాళ్లు. ఏ మహానుభావుడు పుణ్యం గట్టుకున్నాడో... చల్లకువచ్చి ముంత దాచుకున్నట్టుంటుందని తిరిగి వెళ్లకుండా సినీమాచూచి, కాళ్ళీడ్చుకుంటూ కొంపకు జేరాము. లక్ష తిట్టుకున్నామ్. లక్షంటే రెండక్షరాలేగా అనుకుంటారేమో? .. అలాగాదు. తిట్టాల్సినవన్నీ, వాళ్లుంటే ఎంత ఖర్చుపెడ్తూన్నా వొళ్లు తెలియదు సరిగదా బుర్రగూడా పనిచేయదా సమయాల్లో ... ఇప్పుడు నావంటిమీద జెర్రులు బారినట్టుంటే మా వాడికి ఆలీబాబాకథలో దొంగలమీద కిరసనాయిల్ పోసినట్టుంది. సినీమా వదిలాక జై శీతారాం అనుకుంటూ కొంపకు జేరాం. వుదయాన్నే మొఖాలు వ్రేలాడవేసుకొని కాలేజీకి ప్రయాణమయ్యామ్.

## 2

మా కాలేజీలో "జానకి" అంటే నాకు మహా యిష్టం. జానకి పచ్చని శరీరలావణ్యం, సొట్టబుగ్గల సోయగం, వంకులు తిరిగిన కేశ సౌందర్యం. బ్రహ్మ విలాసానికి సౌందర్యంతో జానకిని సృష్టించాడా... అన్నట్టుంటుంది. చిన్నప్పుడు కొవ్వలివారి జంపనవారి నవలలు చదువుతోంటే నాకేమీ తెలిసేదికాదు, మా వూళ్ళో ప్రేమించుకొని యిరువురు నూతిలోపడి మరణించారు.

వాళ్లు వేరువేరు కులస్థులు. అందుచేత అంతా వాళ్ళను ప్రేరేత్తిచూపి నానామాటలనేవాళ్లు. నేనూ అన్నాను. అబద్ధమెందు? నేనూ ఏమిప్రేమలు, తన్నేవాళ్ళులేక ... అనే జాతిలో వుండేవాణ్ణి. మరి నాకు ఆదే రోగం అంటుకుంది. అన్ని రోగాల్లోకీ యీ ప్రేమ రోగం మహా చెడ్డదనుకుంటూ ... దీనికి మందేదైనా వుందో లేదోగాని ... 'జానకీ!' అని ఎవరైనా జానకిని పిలుస్తోంటే నా వొళ్ళు పులకరించి పోయేది. నా వైపు ప్రేమతో వొక్కసారిచూస్తే చాలనుకునే రోజులు. అవి రానురాను నా పాలిటి భాగ్యలక్ష్మి ముందుకు తూలసాగాయి. కాని ఒక్క సంగతి. ఏముంది! అమ్మాయిగారికి నా సంగతి బాగా తెలిసిపోయింది. జానకి ఒక్కోసారి పుస్తకాలు మరచివచ్చేది. కొన్ని తెచ్చినా ... నోట్సులు, అవి యివీ మర్చిపోయివచ్చేది. పాపం, మనసంతా నన్నుగూర్చి పనిచేసేదిగాబోలు. పుస్తకాలు మర్చిపోయిందని, నేనేవచ్చి యిచ్చేవాణ్ణి. క్లాసుకాగానే అంతాచేరి గోలచేసేవాళ్లు. ఎలాగయినా మగవాణ్ణి గనుక, అందులో జానకి నా కిష్టమైనదిగాబట్టి, ఏవో సిగ్గుదొంతరలు నాలో నిండివుండుటచే, ముసిముసి నవ్వులు నవ్వుకునేవాణ్ణి. నా నవ్వులో 'నా జానకీ' మీద ప్రేమ నిండివున్నదనే తెలిసిపోయేది. ప్రతి బజారులో నేనే వుంటానని తెలిసిన జానకి నన్ను చూడగానే కొరకొరలాడేది. కాని ఒక్కగంట సేపటిలోనే చిరచిరలు మటుమాయమయ్యేవి. ఎవరైనావుంటే కోపంతో నిండివుండడము, వీలుగా వుంటే చిరునవ్వుల వలపులతో స్వాగతం యివ్వడము. ఏంటో జానకి మనస్తత్వం నాకేగాదు, నా ఫ్రెండ్ ప్రభాకరానికికూడా, తెలిసేడిదిగాదు. ఆమె ప్రవర్తనను మేమిద్దరం కనిపెట్టలేకపోయామ్.

అప్రయత్నముగా ఒక రోజు, 'జానకీ', జానీ అనే పిలుపులు కాలేజీ ద్వారంలో విన్పించాయి. అక్కడ జానకి మాముందే నడుస్తోంది. వెనుకకు తిరిగి చూశామ్. సరళ, నిమ్మి వస్తూ జానకిని పిలుస్తున్నారు. పిలుపువిన్న జానకి పామువలెనున్న జడను ఒక్క వూపుతో ముందుకువచ్చిపడేలా వెనక్కు తిరిగింది. వెంటనే మా ఆకారాలుచూచి చిన్న సంపెంగ రేకుల్లావున్న పెదవులపై చిరునవ్వు ప్రసాదించింది. జానకితో కలుసుకోనవలయునని నిమ్మి, సరళ వడిగా వస్తూ మమ్మల్నిచూసి భయపడ్డారు. సరళ నిమ్మితో అంటోంది. "అడుగో ఆ నూరిగాడు - వట్టి రౌడీ వెధవ. ఆ ప్రక్కనున్న ప్రభాకరాన్ని పాడుచేస్తున్నాడు" అని తన అక్కసంతో వెళ్ళబోను కుంటోంది. ఆ మాటలు నా చెవినబడ్డాయ్. సమయం వస్తుందిలే అని తలవూపి వూరుకున్నా, అది మా వాడికి కూడా చెప్పాను. కాని మా వాడికి సరళ అంటే ప్రాణం. గాబట్టి ఎక్కువ పట్టించుకోకులే...ఏదో అన్నది అని నన్ను సరిదీశాడు.

3

యఫ్. ఎ. రెండవభాగము గనుక మా వాడు, నేను బజార్లకు స్వస్తిచెప్పాము. పరీక్షల సర్దుబాటులో యితర ప్రపంచాన్నే మరచిపోయాము. మాకు భిన్నం గల్గించడానికి సరళ, జానీలు వచ్చేవాళ్ళు. కాని వాళ్లతో సోదిపెట్టుకోకుండా అవతలికి దాటబంపేవాళ్ళమ్. అందుకనివాళ్లు పరీక్షకువెళ్ళేముందు మమ్మల్ని ... "అబ్బో, పూర్ణబ్రహ్మచారులయ్యేరు వీరు" అని వాళ్ళల్లోవారు అనుకుంటూండేవాళ్లు. కాని మేము నవ్వుకునేవాళ్లము. అనుకోని రీతిగా మేమిద్దరం పరీక్షల్లో చక్కగా ఆన్సర్ చేశాము. జానీ చివరరోజు పాపం సరిగా వ్రాయలేదని చెప్పింది. మా వాడు "అయినా గొప్పింటి పిల్లలకు చదువెందుకు" అన్నాడు. ఆ మాటకు జానీ..."రోడ్ల వెంట తిరిగే రౌడీలుంటే మేము చదువుకోక ఏమిచేయమంటావు? ... మరి దిగులుగదూ! ...అంది." ఆ మాట నన్నేనని అనుకున్నా ... మరునాటి సాయంకాలం అల్పాహారవిందు జరిగింది. ఆ రోజు జానకిని చాల గోలచేయ ప్రయత్నించాముగాని ... వీలుపడలే. అందుకు జానకి పైపై సంతోషాన్ని వెలిబుచ్చింది. కాని లోపల్ల పుట్టెడు దిగులు. పాపం, జానకి అవస్థ నేనిప్పటికీ మరచిపోలేదు.

తర్వాత ఫోటో అన్నారు. ఆ సంతోషంమీద వున్నామంతా ఫోటోగ్రాఫర్ రానేవచ్చాడు. మా వాడికి సరళ ప్రక్కన నిలబడాలని వాడికోరిక, నేను జానకి వెనుక నిలబడాలని, చివరకు మా వూహాలన్నీ పటాపంచలయ్యాయి. పొడవుగానున్న నన్ను సరళ వెనుకకు పంపాడు ఫోటోగ్రాఫర్, ప్రభాకరాన్ని జానకి ప్రక్కగా నిలబెట్టాడు. నిజంగా నాకంటి వెంట నీరు గిర్రున తిరిగిందనుకున్నా ... వాణ్ణి బయటకురానిచ్చి తన్నాలనుకున్నా ... వెధవపీనుగ అని ఎన్నెన్నో తిట్టా ... జానకి నా వైపు ఎన్నోసార్లు చూసింది. కాని ఏమిలాభం? గుటకలుమ్రింగి వూరుకున్నాము నేనూ మా వాడు. మంచి పరిచయముండుటచే సరళ, జానీ వాళ్లు కలసి మాతో సినీమాకు బయల్దేరారు. ఇదో గోల యీ సినీమావాళ్లు ప్రత్యేకస్థల నిర్ణయాలు చేశారుగదా ... ఏదో గడచిపోయింది. ఎవరికొంపలకువాళ్ళుజేరారు.

మరునాడే మా ప్రయాణం. మళ్ళీ పల్లెటూరిగోల. కాలికి బలపంగట్టుకొని తిరిగి నాకు యీ పల్లెటూరు యమలోకంగా గన్పడేది. ఒక్క కాలేజీపిల్లగూడా గన్పడేదిగాదు. ఎవరైనా కన్పించిన తుర్రున యిండ్లలోకి దూరేవాళ్లు. సినీమాపాటలు పాడనేపాడరు. డ్యాన్సులు అంతకంటే శూన్యం. ఎదుటకురానివాళ్ళు ఎగరమంటే ఏమెగురుతారువాళ్లు, ఇదో ప్రపంచమురా నాయనా ... మళ్ళీ కాలేజీ ఎప్పుడు తెరుస్తారోనని రోజూ వ్రేళ్లు లెక్కవేసుకోడంతో రిజల్ట్సుగూడా తెలిసిపోయాయి. అదృష్టంవలన నేనూ ప్రభాకరం పాసయ్యాము. జానీ పూర్తిగా తప్పింది. సరళ ఒక్కపార్ట్ అయింది. ... మా యింట్లో కలకలము బయల్దేరింది. నా పరీక్షా ఫలితం విన్న నాన్న పెళ్ళిచేయాలని సంకల్పించాడు. ఈ మాటవిన్న నా శరీరం చెమటబిందువుల్తో నిండిపోయింది. మంచంలోని నాయనమ్మ నన్నొక యింటివాణ్ణిచేస్తే చూస్తుందట. 'పిల్లికి చెల్గాటం, ఎలుకకు ప్రాణసంకటంలా వుంది.' ఈ విధంగా బజార్లలో తిరిగే నాకు బంధం పడితే ... అమ్మ బాబో, ఇక ఆవిడ తిరగనిస్తుందా? చీపిరికట్ట తిరగవేయదూ! నా వొళ్లు వణకినట్లయింది. మధ్యరకంలో నలిగిచస్తోన్న కుటుంబాలెన్ని వున్నాయో అన్నీ నా కండ్లముందు గోచరించినట్లయింది. ఆ దిగుల్తోనే ఏజవాబు చెప్పకుండా కాలేజీకి దారితీశాను. మా వాడూ తోడయ్యాడు. బాబూ ... బ్రతికి బయటపడ్డానురా ... నన్నా



నవంబరు ఒకటవ తేదీన పశ్చిమ బెంగాలు గవర్నరుగా అధికార స్వీకారంచేసిన కుమారి పద్మజ నాయుడు

మా వాడితో. 'ఏం'టన్నాడు. ఈ కథంతా చెప్పేక ఫక్కున నవ్వాడు.

4

జానకి లేని లోటు రోజురోజుకు మరింత బాధనిపించింది. నాకేగాదు. సరళ లేకపోవడంతో మా వాడికి ప్రాణం వుసూరుమంటోంది. దానికి తోడు లెసన్స్ మరీ ఎక్కువయ్యాయి. ఆరోజు గాంధీ


జయంతి. గనుక మా కాలేజీకి శలవుయిచ్చారు. మా వాడు ఎందుకో 'స్టేషన్‌కు పోదామురా!' అన్నాడు. తలనొప్పితో బాధపడుతున్న నేను 'రాలేనురా' అన్నా... కాని వాడు నామాట వినకుండా "వస్తావా? రావా?" అని పట్టు పట్టాడు. చివరకు వప్పుకొని యిద్దరం స్టేషన్‌కు పోయాం. మాకు పరిచయమైన వాళ్ళు చాలమంది కనపడి "ఏమిరోయ్ ... యీ రోజు ఏదో ఎత్తు వేశారే" అని అనడము మొదలెట్టారు. బండి గుడివాడ పోవడానికి నిల్చివుంది. మా యిద్దరిదీ చెరోత్రోవయింది. ప్రతికంపార్ట్‌మెంటు గాలించాం. నాకు పది అడుగుల దూరంలో ప్రభాకరం యీల వేసి పిలిచాడు. నాలుగడుగులల్లో వాణ్ణికలుసుకున్నా... బండి సాగింది రాక్షసిబొగ్గు పొగతో... నేను వురవడిమీద తలుపు నానుచేసుకొని కిటికీని గట్టిగా పట్టుకున్నా...ప్రభాకరం లోపలున్నాడు. ఎలాగో కష్టపడి సిగరెట్ వెలిగించి రైలు పొగతో, నా పొగను లీనంచేశాను. సిగరెట్ పొగ వలయాలు చుట్టు రైలు పెట్టెలోకికూడా దూసుకుపోతోంది. ఇంతలో కమ్మని కంఠం వినిపించింది. అలాకిటికీలోనుండా తొంగిచూశా......"జానకిని కూడా మరపించే పిల్ల" ఎక్కడలేని ఆనందం పెల్లుబికింది. "ఏయ్! బుద్ధిలేదూ? ఏంటీ ఆ పొగ, నువ్వూనూ;" ...అంది. నాకు కోపంరాలేదు. కిటికీలోకి తలపోనిచ్చి... "అబ్బో ... మీరు-మీ స్నోకంపూ ...బుద్ధిలేదూ..." అన్నాను. ఆ అమ్మాయి ముఖంలో కోపమే కోశానా కన్పించలేదు. ఆ పిల్ల ప్రక్కనున్న అమ్మాయికి మాయిద్దరి తంతూ తెలిసిపోయింది. నేను ప్రభాకరం వొక్కటేనని... ఆమె యీ పిల్ల అక్కయివుంటుందని గ్రహించా... ఆమె చేతిలో ఆంధ్ర ప్రభ వుంది. ప్రభాకరం తలుపు తీశాడు. నేనూ మెల్లగా లోపలకు ప్రవేశించా. పుస్తకమడగరా అని వాడిచెవిలో వూదా...వాడు నిజంగానే ఆమెను పుస్తకమడిగాడు. ఆమె ముఖం కోపంతో కందగడ్డలావుంది. దానికితోడు వీడి మాటలకి ఆమె మండిపోయింది. లేనివ్వనంది. ఆకంపార్ట్‌మెంట్‌లోని వాళ్లకు మా ప్రసక్తి పట లేదనుకుంటూ. అంతా భగవద్గీత విషయాలు, వాళ్ళ కోడళ్ళ ప్రతాపాలు చెప్పుకుంటున్నారే గాని మా విషయం...మర్చిపోయారంతా. వాళ్ళను గురించి ఏవో చెప్పుకుంటున్నా మనుకున్నారు యిద్దరక్కచెల్లెళ్ళూ...వుండండి ప్రక్కస్టేషన్ వచ్చాక...అని చెల్లి అంటూంటే కాదుకాదు గొలుసులాగి రిపోర్ట్ చేస్తానంటుంది అక్క. ఇదంతా విన్న నేను వూరకుండలేకపోయా. 'అమ్మాయ్! గొలుసులాగితే మీ దగ్గర 50/ రూ రకీమని పుచ్చుకుంటారన్నాను. ఆ మాట విన్న పెద్దామెకు కళ్ళు ఎఱ్ఱబారాయి. 'ఈ కాలేజీకుఱ్ఱవాళ్ళకు మట్టుమర్యాదలు వుండవు.' అంది. మావాడు. 'అబ్బోతమకండీ!' అన్నాడు. ఆమె 'చర్రనలేచి తమకం, జంకం వుండండి.' అని గొలుసు లాగపోయింది. చెల్లెలువారించగా ఆగండం తప్పింది. అసలు వీళ్ళది ఏవూరో...అనే అనుమానం గల్గింది. పెద్దమ్మాయి కన్నా చిన్నమ్మాయికి మేములా వెంటపడిరావడం యిష్టంలాగుంది. అక్కకు తెలియకుండా చెల్లెలు టికెట్ చూపింది. దానిమీద 'గుడివాడ'నివుంది. ఇంతలోబండి ప్రక్కస్టేషన్‌కు దూకుడుమీద వచ్చిపడింది. మేమిద్దరం జనంనుండి తప్పుకుంటూ బండి దిగాము. 'వహీదా...చీరియో!' ...అని అంటూ నవ్వుకుంటూ అటుఇటు పచార్లు చేశాము. మళ్ళీ బండి మాయమయింది. మేమిద్దరం పెద్దమ్మాయి భానుమతనివాడు చిన్నమ్మాయి వహీదా అని నేను వాదించుకుంటూ ... తర్వాత బండికి మాగదులకు జేరామ్.

బి. ఏ పరీక్షలు వాటంతటవే దొర్లుకొని వచ్చాయి. కడుపులో చేతులెట్టి దేవినట్టుంటుంది. దానికితోడు మానాన్నకు, నా పెండ్లి విషయం జరుపుతూ ఏమాట చెప్పడంలేదని గుర్తుకొచ్చాయి. నేనొక వింత ప్రపంచంలో వున్నాననిపించింది. బి. ఏ. పరీక్షలయ్యాక యింటికి వెళ్ళబుద్ధిగాలేదు. నాల్గు రోజులు గుంటూరులోనే గడిపాను. ఇకతప్పదని యింటికి బయల్దేరాము. వాకిట్లో అడుగెట్టగానే మానాన్న 'పెండ్లిమాట' అంటం నాచెవినిపడింది. ఇక నేమి చేయాలో తెలియక తలవూపాను.

పంచాంగం చూపించారు. మానాన్న నాకు తెలియకుండానే పెండ్లికూతుర్ని నిశ్చయించినట్టుగా తెలిసిపోయింది. నేనాసమయంలో యజ్ఞ పశువులా తయారయ్యా...మా వాడూబయల్దేరాడు. మేమంతా నలుగురయిదుగురం ప్రయాణమయ్యాము. రైలెక్కగానే ఏవో పిచ్చిపూహాలు నాలో నాట్యమాడాయి. ఇదివరకు ఎగతాళిచేసిన పిల్లలు ఆ బండిలోనే వున్నట్లనిపించింది. క్రమేణ నాచూపులు బారులు దీరివున్న పొగమళ్ళలోకి దూసుకుపోయాయి. ఉదయం 7½ గం గుడివాడలో బండి ఆగింది. ప్రక్క పల్లెటూరికి కాలి మార్గం...నా వొళ్లు మండింది. యీ పెళ్ళి పెత్తనదారులు యిష్టంవచ్చినట్లు చేస్తారు. వినకపోతే చావమంటారు. ఎక్కడలేని వోర్పు వహించి ఓ రచ్చబండ దగ్గరకొచ్చాము. అక్కడే వున్న పిల్ల తండ్రి యింటికి తీసికెళ్ళారు...అప్రయత్నంగా ఓపిల్ల తొంగిచూసింది. ఎవరో ననుకున్నా...ఆ పిల్లే! రైల్లోమేము చూసినపిల్లే...నాకు ఎక్కడలేని సంతోషం పొంగివచ్చింది. ఇంతకూ మానాన్న మాట్లాడింది పెద్దమ్మాయినట. నా గుండె ఝల్లుమంది.

**5**

అన్నిప్రయత్నాలు జరిగినవి. మేళతాళాల శబ్దము మిన్నుముట్టుతున్నది. కాని పెళ్లికొడుకింత సేపటికి పీటలమీద కూర్చోడానికిరాలేదు. పెండ్లికొడుకు ఉనికినిగురించి ఏమూల చూచినా గుసగుసలు బయలుదేరినవి. దాంతోపాటు పెండ్లికూతురు చెల్లెలు కనుపించకపోయేసరికి నలుగురు నానావిధాలుగా మాట్లాడసాగారు. ఉభయపెండ్లివర్గాలవారు ఎవరిమటుకువారు నోరుమెదపక యూరుకున్నారు. పెండ్లి ఆగిపోయింది. కాని నేను, పెళ్ళికూతురు చెల్లెలు ఎక్కడికి పోయింది ఎవరికి తెలియదు. వెనుకముందు ఆలోచించకుండా ఆ నాటి రాత్రి...మాపలాయనం వూళ్లో వుదయాన్నే కల్లోలంగల్గించిందనుకుంటూ ... కాని నా కాద్దినం ప్రపంచమే గోచరించలేదు. నేను మా కనకంతో బొంబాయిలో మెరశాను. ఉద్యోగం కొరకు పట్నమంతా గాలించాను. చివరకు బొంబాయిలో స్టీమర్లమీద తనిఖీదార్ గా నెలకు 300/రూ...ఉద్యోగం దొరికింది. మేమిద్దరం రిజిస్టర్డు పెండ్లిచేసికొనిసంసారం సాగించాం...బొంబాయి మాకొక స్వర్గంలానిపించింది. నిక్కు



కేరళ రాష్ట్ర ప్రథమ గవర్నరు
శ్రీ బి. రామకృష్ణరావు

స్నేహితుల సాంగత్యమువలన గడ్డంపెంచా...పజిల్స్ పూర్తి చేయడం అలవాటయింది. ఇంటిమీద బెంగ గల్గినా మా కనకం పొందువల్ల బెంగకాస్తా మాయమయ్యేది. కాలచక్రం గిర్రునతిరిగిపోతోంది. నా అదృష్టంవలన క్రాస్ వర్డ్స్ లో 24000/– రూ వచ్చాయి. ఆరోజు పత్రికలో నా అడ్రస్సును వివరించారు పత్రికవారు. మా మామగారికో అలవాటుంది – పత్రిక చదవడం ఏరోజు మానివేయరు. నా అడ్రసు చూచిన మామగారు వస్తారనుకున్నా... ఇల్లు మార్చివేయడమే మంచిదనుకున్నా. యిల్లంతా సరిచేయమని కనకాన్ని పురమాయించాను

ఇంట్లో మామురళి గోలతో "వద్దులెండి. వచ్చినా ఏమనరు" అని మా ఆవిడ సరిదీసింది. కాదని బండి కొరకు బయల్దేరాబజారుకు. నేననుకున్నంత పనీ జరిగింది. రానేవచ్చారు మా మామగారు. ఆయన చుట్టులో నా సిగరెట్ పొగగల్పింది. ఆయన్ని చూడగానే నా మొహాన నెత్తురుచుక్క లేదు. నావేషం చూచిన మామామగారు మండిపోతారనుకున్నా... తలకు నల్లనిమఫ్లర్, బాగాపెరిగిన గడ్డం. ఖరీదుగల్గిన పేంట్, ధైర్యం తెచ్చుకొని మామామగార్ని ఆహ్వానించాను.

ఇంటిలోనుండి 'నాన్నా! ... కాఫీ...' అని వస్తున్న మురళిని చూశారు. ఆయన కోపం పటాపంచలైంది. నేను లోపలికి వెళ్ళాను. మాకనకం నాతత్తరపాటును చూచి విస్తుపోయింది. వరండాలో కూర్చొని వున్న మామామగార్ని చూపాను. మా ఆవిడ భయపడుతుందనుకున్నా కాని అదేమీ జరుగలేదు. ఇంటివిషయాలు చెప్పాడు. అంతా అయ్యాక, 'కనకం! మీనాన్నగారేమన్నారూ' అన్నాను. 'ఆ...ఏమంటారు? మనకు కల్గిన తుపానుకు మన మురళి ఆదుకున్నాడు.' అని ముసి ముసి నవ్వులు నవ్వింది. మామామగారు చివాట్లు పెడతారని భయపడిన నేను ధైర్యంగానే మెలగాను.



నేపాలులో రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ సౌహార్ద్రపర్యటన సందర్భమున రాజదంపతులతో నున్నప్పటి దృశ్యము